క్లుప్తంగా

యంత్రాలతో సాగు ఉత్తమం

సీఎస్‌పురం (పామూరు): ప్రభుత్వం సమకూర్చిన యంత్రాలను రైతులు వ్యవసాయంలో వినియోగించుకునేలా చూడాలని గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్ అన్నారు. కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో భాగంగా రైతుసేవా కేంద్రాల ద్వారా గతంలో ఇచ్చిన యంత్ర పరికరాలను శుక్రవారం గిద్దలూరు ఏడీఏ బాలాజీ నాయక్ స్థానిక ఏఓతో కలిసి మండలంలోని పెదరాజుపాలెంలో పరిశీలించారు. ఏఓలు బి.సంపత్‌కుమార్, పి.జ్యోత్స్నదేవి, పి.రంగకృష్ణ, ఏఈఓ పావలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురుగుమందు దుకాణాల తనిఖీ

పీసీపల్లి: మండల పరిధిలో ఉన్న పురుగు మందులు, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి కె. ప్రకాష్ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, బిల్లు పుస్తకాలను, టాక్స్ ఇన్ వాయిస్ స్టాక్ బోర్డు నిర్వహణ తీరును పరిశీలించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

సింగరాయకొండ: బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న రుణాలకు అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డి.జయమణి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. లబ్ధిదారులకు సబ్సిడీపై 2 లక్షల నుంచి 5 లక్షల రూపాయల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీలోపు బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

18న ప్రజా వేదిక

కొండపి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమంపై ప్రజావేదికను ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

బడిఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండాలి

పామూరు: బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించి బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలా చూడాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బంగారుబాల్యం మండల కమిటీ సమావేశం జరిగింది. సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, రవి, సుచరిత, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): బంగారు బాల్యం కార్యక్రమం విజయవంతం ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ డి.మంజునాథ రెడ్డి, ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం మండల కమిటీ సమావేశం జరిగింది. సూపర్‌వైజర్ కె.దేవకృపావరం, వెలుగు సీసీ కాశయ్య, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

నర్శింగోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో...

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని నర్శింగోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారి హర్డీష్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నర్శింగోలు, చిత్రికూరపాడు, పైడిపాడు, రామచంద్రాపురం, రెడ్డిపాలెం, కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి: మండలంలోని కే ఉప్పలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజినీర్ హర్డీష్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ముప్పవరం, చోడవరం, కే ఉప్పలపాడు, దేవిరెడ్డిపాలెం, వెన్నూరు, చిన్న వెంకన్నపాలెం, తూమాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

పామూరు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని విద్యుత్ విజిలెన్స్ ఈఈ హైమావతి, కనిగిరి ఈఈ వీరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పలుగ్రామాల్లో విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారులు దాడుల నిర్వహించారు. ఈసందర్భంగా వగ్గంపల్లె సబ్‌స్టేషన్ ప్రాంగణంలో వివరాలను వెల్లడించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. పామూరు డీవై ఈఈ డీవీ క్రిష్టారెడ్డి, కనిగిరి డీవై ఈఈ ఉమాకాంత్, విజిలెన్స్ డీవై ఈఈ, ఏఈఈ, మండల ఏఈఈలు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

సింగరాయకొండ: పేకాట కేంద్రంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. శుక్రవారం పెరల్ డిస్టిలరీ కంపెనీ వెనుక పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 6,300 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

పుణ్యక్షేత్రంలో అపచారం

- మాలకొండలో మద్యం అమ్మకాలు
- మామూళ్ల మత్తుల్లో ఎక్సైజ్ అధికారులు
- పట్టించుకోని ముఖ్య నేతలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు



పూజ సామాగ్రి అమ్ముకునే షాపులు ఉన్న రోడ్డు

వలేటివారిపాలెం:

ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన మాలకొండలో అసాంఘిక కార్యకలాపాలు హెచ్చుమీరుతున్నాయి. మత్తు దెబ్బకు భక్తులు కూడా చిత్తవుతున్నారు. ఇక్కడ మద్యం షాపులు జోరుగా కొనసాగుతుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బెల్ట్ షాపులు పవిత్రమైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం కొండ కింద కూడా వెలిశాయి. ఏకంగా మహిళలే మద్యం అమ్మకాలు చేస్తుండటం విస్తుగొలుపుతోంది. ఈ పుణ్యక్షేత్రానికి ప్రతి శుక్రవారం దేవాలయం పరిధిలోని కొండ కింద వసతి గృహాల్లో భక్తులు నిద్రజేసి శనివారం ఉదయం దర్శనం కోసం వేచి చూస్తారు. ఇలా ప్రతి వారం దాదాపు 3 వేలు మంది భక్తులు బస చేస్తారు.

70 కుటుంబాలకు ఉపాధి

బస్టాండ్ కూడలి నుంచి రోడ్డుకు ఇరువైపులా జీవనాధారం కోసం గ్రామంలోని 70 కుటుంబాలు పూజా సామాగ్రి అమ్ముకుంటున్నారు. అయితే వీటితో పాటు కొంత మంది మహిళలు చాకచక్యంగా మద్యం అమ్ముతున్నారు. ఈ మద్యం సేవించి కొంత మంది యువకులు శుక్రవారం రాత్రి వేళలో వసతి గృహాల దగ్గర సంచరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేదికలు మీద అక్రమంగా మద్యం అమ్మకాలు అమ్ముతుంటే వారి మీద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పకొస్తున్నారు. కానీ పవిత్ర పుణ్యక్షేత్రం వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతుంటే పట్టించుకునే వారు లేరని స్థానికులు వాపోతున్నారు. పుణ్యక్షేత్రం ఉన్న గ్రామంలో మద్యం అమ్మకాలు, అక్రమ కట్టడాలపై “సాక్షి” కథనాలు ప్రచురిస్తుంటే.. నియోజకవర్గ ముఖ్య నేత ఆగ్రహం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ రమణను వివరణ కోరగా పుణ్యక్షేత్రంలో జరుగుతున్న అక్రమ మద్యం అమ్మకాల గురించి తనకు తెలియదని.. ప్రస్తుతం నేను నెల్లూరు మీటింగ్‌కు వెళ్తున్నానని పొంతన లేని సమాధానం చెప్పారు.

> **మదిరి నాయడు**
> నాతో పాటు పోలీసు సిబ్బంది శుక్ర, శనివారాలు అక్కడే ఉంటున్నాం. ఇప్పటి వరకు మద్యం అక్రమ అమ్మకాల గురించి నాకు సమాచారం లేదు. విచారణ చేసి అది నిజమని తేలితే నిందితులను కఠినంగా శిక్షిస్తాం.
> – వలేటివారిపాలెం ఎస్సై

> **మహిళే ఇలా చేస్తే ఎలా?**
> 
> గతంలో ఎన్నడు లేని విధంగా మాలకొండ గ్రామంలో మద్యం ఏరులై పారుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అమ్మకాలు గురించి తెలిసిన కూడా పట్టించుకోపోవడం చాలా బాధాకరం. మహిళలే ఇక్కడ అమ్మకాలు జరపడం దారుణం.
> – కామినేని మాధవ

> **పుణ్యక్షేత్రం పవిత్రత కాపాడాలి**
> 
> బహిరంగంగా మద్యం అమ్ముతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. వాస్తవమే అని వారిని ఖండించే పరిస్థితులు కాని, వారి పేర్లు చెప్పే పరిస్థితి కూడా లేకపోవడం విచారకరం. ఇదే విధంగా కొనసాగితే భక్తుల మనోభావాలు దెబ్బ తింటాయి. పుణ్యక్షేత్రం పవిత్రత కాపాడాలి.
> – ముతకని వెంకటేశ్వర్లు

> **నీచమైన సంస్కృతి**
> 
> పంచాయతీలో అయ్యవారిపల్లి, రామలింగపురం, మాలకొండ గ్రామాలున్నాయి. కొండ కింద మద్యం అమ్మకాలు జరపటం చాలా నీచమైన సంస్కృతి. అధికారులే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నప్పుడు, గ్రామ సర్పంచ్‌గా నేనేమీ చేయలేని పరిస్థితిలో ఉన్నా.
> – డేగ వెంకటేశ్వర్లు: గ్రామ సర్పంచ్

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి


పొన్నలూరులో ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి


సీఎస్‌పురం: తిరుమలనాథస్వామి వారిని శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్, భక్తులు


మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో రథోత్సవం నిర్వహిస్తున్న ఈఓ, కమిటీ, భక్తులు


కే ఉప్పలపాడులో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): వైకుంఠ ఏకాదశి వేడుకలను ప్రజలు మండల కేంద్రమైన సీఎస్‌పురంతో పాటు మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని అయ్యలూరివారిపల్లెలో శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథమస్వామి ఆలయంలో మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో, భైరవకోన త్రిముఖదుర్గాదేవి, కామాక్షీసమేత చంద్రమౌళీశ్వ ఆలయంలో ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు. అయ్యలూరివారిపల్లెలో వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన, వెంకటరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతి, నారాయణరెడ్డి దంపతులు స్వామివార్లకు వస్త్రాలు సమర్పించి శేషవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మిట్టపాలెంలో స్వామివారి ఆలయంలో ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి, నారాయణ స్వామి ఉత్సవమూర్తులకు రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, బయసాని మధుసూదనరావు, తిరుమలనాథస్వామి ఆలయాల చైర్మన్ చలమయ్యనాయుడు, ముడుమాల నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

పీసీపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండల పరిధిలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వెంగలాపురం సమీపంలో పాలేటి నది ఒడ్డున వెలసిన పంచలింగాల కొండ, పెద్ద అలవలపాడులో వెలసిన ఉమామహేశ్వర స్వామి, పెద ఇర్లపాడు గ్రామంలో మహారుద్రపీఠంలో వెలసిన సహస్రలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు దర్శించుకునేందుకు బార్లు తీరారు.

పామూరు: ముక్కోటి ఏకాదశి వేడుకలను మండల కేంద్రమైన పామూరుతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ఏర్పాటు చేసిన ఉత్తరద్వార దర్శనార్థం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివార్ల దర్శనంచేసుకున్నారు. ఈసందర్భంగా స్థానిక శ్రీమదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, వల్లీసమేత భుజంగేశ్వర స్వామి, సత్యనారాయణస్వామి, అయ్యప్ప, సాయిబాబా, కన్యకాపరమేశ్వరీదేవి, మహాలక్ష్మమ్మ దేవాస్థానాలతోపాటు మండలంలోని పలుదేవాలయాల్లో ఆలయ అర్చకులు అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులకు కోలాటం, భజంత్రీల మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్చుతూ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండల పరిధి నల్లగండ్ల పంచాయతీ చిన్న గొల్లపల్లి గ్రామం నాగు లేటి ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజులు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి పొంగళ్లను పొంగించారు. చెన్నకేశవ స్వామి వారికి కొత్త బట్టలు సమర్పించారు. ప్రత్యే పొంగళ్లను పొంగించి ఆయన ఆలయంలో కొబ్బర కాయలు కొట్టి పూలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు .ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొండపి: ముక్కోటి ఏకాదశి వేడుకలను కొండపి నియోజకవర్గంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కొండపి మండలంలో ఉదయం నుంచే విష్ణాలయాలు, పలు దేవాలయాలకు భక్తులు క్యూ కట్టారు. ప్రత్యేక పూజలతో ఆలయాల్లో గోవింద నామస్మరణ మార్మోగింది. భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలంలోని కే ఉప్పలపాడు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో విశ్వబ్రాహ్మణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకుడు రాఘవేంద్రశర్మ, విశ్వబ్రాహ్మణులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మర్రిపూడి మండలంలో...

మర్రిపూడి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. భక్తులు ఆలయానికి భారీగా చేరుకుని విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు నారాయణ మారుతీచార్యులు, అంబయ్య పంతులు అమ్మవారు, వేణుగోపాలస్వామి, శివపార్వతులను పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో స్వామివారి ప్రతిమలను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు.

పొన్నలూరు మండలంలో...

పొన్నలూరు: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పొన్నలూరులోని చెన్నకేశవస్వామి దేవాలయంలో స్వామివారిని పూలతో అలంకరించి మంగళవాయిద్యాలతో పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సింగరాయకొండలో...

సింగరాయకొండ: మండలంలోని ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాతసింగరాయకొండలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు ఉత్తర ద్వారంలో స్వామివారు దర్శనమిచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాములవారు, గీతామందిరంలో శ్రీ కృష్ణుడు, ఊళ్లపాలెంలో శ్రీ కోదండరాముల వారు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


మర్రిపూడి : వేణుగోపాలస్వామిని ఊరేగిస్తున్న భక్తులు


పామూరు మదన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉత్తర ద్వార దర్శనంలో పాల్గొన్న భక్తులు


హనుమంతునిపాడు: చిన్నగొల్లపల్లి చెన్నకేశవ స్వామి గుడిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పొన్నలూరులో చెన్నకేశవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాలిటీలోని 11వ వార్డు కాశిరెడ్డి నగర్ కాలనీ యానాదులు నివాస ప్రాంతాల్లో చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్ శనివారం పర్యటించి అక్కడి ప్రజల సమస్యల్ని క్షేత్రస్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలు, కొత్త విద్యుత్ దీపాలు, మంచినీటి సౌకర్యం, పూర్తిస్థాయిలో అందిస్తున్నామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చెట్లు పెరిగి విష పురుగులు వస్తున్నాయని ఫిర్యాదు చేయగా వెంటనే చెట్లను తొలగించి, దగ్గరలో ఉన్న స్మశాన వాటిక ప్రాంతంలో కూడా చెట్లను తొలగించి శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, వార్డు అడ్మిన్ సునీల్ కుమార్, ఎమినిటీ కార్యదర్శి షంషీర్, పారిశుధ్య మేస్త్రి రత్తయ్య ఆ ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలి

కనిగిరి రూరల్: వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటికీ 28 ఏళ్లు పూర్తైనా నేటికీ జనం ఎదురు చూపులే మిగిలాయని ఉదయగిరి ప్రాంత కన్వీనర్ డాక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు సాధన ఐక్యవేదిక ఆధ్వర్యంలో కనిగిరి యూటీఎఫ్ కార్యాలయంలో వి. మలకొండారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పటికి రూ. 6,062 కోట్లు ఖర్చుపెట్టారని.. ఇంకా రూ.3,595 కోట్లు ఖర్చుపెడితే గాని ప్రాజెక్టు పూర్తి గాదు అని నిపుణులు చెబుతున్నారన్నారు.మీగడ వెంకటేశ్వరా రెడ్డి మాట్లాడుతూ తాత్కాలిక బడ్జెట్లో రూ. 395 కోట్లు నిధులు కేటాయించి 2 ఏళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు. కడప జిల్లా కన్వీనర్ బి. నారాయణరెడ్డి మాట్లడుతూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కుందూరు వెంకటేశ్వర్లు, వి. నాగిరెడ్డి, యం. తిరుపతి రెడ్డి, జి. శ్రీనివాసులు, ములే బ్రహ్మారెడ్డి, పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

మర్రిపూడి: మర్రిపూడి పంచాయతీ పరిధిలోని గంగపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి కోరారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. వీలైనంత వరకు వైద్యశాలల్లో కాన్పులు జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తించాలన్నారు. అవసరమైతే ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. వైద్యసిబ్బంది వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం వైద్యశాలలోని వసతులను ఆయన పరిశీలించారు. వైద్యశాలకు సంబంధించిన నిధులను తాగు నీరు, మురుగుదొడ్ల మరమ్మతులకు వినియోగించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎం.జగదీష్, సర్పంచ్ కదిరి భాస్కర్, వైద్యాధికారులు వీరబాబు, విద్యాసాగర్, ఈఓఆర్డీ సాంబశివరావు, సరస్వతి, రమాదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ నమోదుపై అవగాహన కల్పించాలి

కొండపి: సున్నా నుంచి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆధార్ నమోదుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రామాంజనేయులు సూచించారు. బంగారు బాల్యంపై ఎంపీడీవో ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈఓ-2 రామారావు, ఏఎస్ఐ అంకారావు, ఏఓ రామకృష్ణ, ఏపీఎం గోపీనాథ్, గురుకుల ప్రిన్సిపాల్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ అసైన్డు భూ రికార్డుల పరిశీలన

హనుమంతునిపాడు: ఫ్రీహోల్డ్ అసైన్డు భూముల రికార్డులను కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ విజయ్ జ్యోతి కుమారి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1954 నుంచి 2003 సంవత్సరం వరకు ఉన్న అసైన్డు భూములు ఫ్రీహోల్డ్ అయిన భూములు పరిశీలించామన్నారు. ప్రభుత్వ రికార్డు ప్రకారం ఉండి ఫ్రీహోల్డ్ అయిన భూములు ఆన్‌లైన్లు చేస్తారన్నారు. తహసీల్దార్ డిలీప్‌కుమార్, డీటీ కె.కిషోర్‌కుమార్, ఆర్ఐ క్రిష్ణచైతన్య ఉన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కొండపి: మండలంలోని పెట్లూరులో శ్రీ సహజానంద ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ అడ్డాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, గాలిపటాలు ఎగరవేయడం, లెమన్ స్పూన్, తదితర ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జ

పీహెచ్‌సీలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

పొన్నలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో, గొబ్బెమ్మలతో, చెరకు గడలు, అరటి తోరణాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు కృష్ణచైతన్య, రవికిరణ్, మల్లికార్జున, ఉమేరా భోగి మంటలు, సంక్రాంతి, కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి రీసర్వే

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని కొండబోయిన పల్లెలో ఈనెల 20వ తేదీ నుంచి భూముల రీసర్వే ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం కొండబోయినపల్లె గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతులు తమ పొలాల పుస్తకాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో సహకరించాలన్నారు.

అంతర పంటలతో లాభాలు

హనుమంతునిపాడు: అంతర పంటలో మంచి లాభసాటిగా ఉండటంతో మండలంలో సాగు చేస్తున్నారు. మండల పరిధి తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో రైతు దోసపాటి నరసయ్య తైవాన్ జామ తోటలో అంతర పంటగా బంతి పూలు సాగు చేస్తున్నారు. అంతర పంట లాభసాటిగా ఉన్నాయని రైతులు చెప్తున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

పీసీపల్లి: పండుగ సమయాల్లో కోడి పందేలు, పేకాట చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిసిపల్లి ఎస్సై జి. కోటయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోనే శివారు ప్రజలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ట్రాక్టర్ దొంగ అరెస్ట్

కొండపి: మండల కేంద్రంలోని కామేపల్లి రోడ్డులో గత డిసెంబర్‌లో ట్రాక్టర్ దొంగతనానికి గురైన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. కొండపికి చెందిన గుమ్మళ్ల రాంబాబు ట్రాక్టర్ అపహరణకు గురవగా, కేసు దర్యాప్తులో భాగంగా చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామానికి చెందిన వ్యక్తి ట్రాక్టర్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ట్రాక్టర స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.